
ప్రజాశక్తి
శుక్రవారం 13 జూన్ 2025
5
విజయనగరం



టెన్త్ సప్లిమెంటరీలో 74 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. జిల్లాలో 3198 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 2390 మంది ఉత్తీర్ణులయ్యారు. 74.73శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో 17వ స్థానంలో నిలిచింది. 1870 మంది పరీక్ష రాయగా 1337 మంది, బాలికలు 1328 మంది పరీక్ష రాయగా, 1053 మంది ఉత్తీర్ణత సాధించారు. జూన్ 13 నుంచి 19 వరకు రీకౌంటింగ్ (ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు వెయ్యిరూపాయలతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఏడాదిలో ఏముంది గర్వకారణం

- ముందుకు సాగని తోటపల్లి, రామతీర్థ సాగర్
- ఉపాధి హామీలో అట్టడుగు స్థానం
- జిందాల్, ఓలం పరిశ్రమలు, సుగర్ ఫ్యాక్టరీల మూత
- ఎండమావిగా కొత్త పరిశ్రమల హామీ
- రేషనలైజేషన్ పేరిట స్కూళ్ల మూతకు కసరత్తు
- ఏజెన్సీలో తప్పని డోలీ మోతలు
- స్కీం వర్కర్లు, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు
- పాలనపై సంబరాలు చేసుకుంటున్న టిడిపి, జనసేన శ్రేణులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



పూర్తికాని తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు ఇదే

అధికారంలోకి రాగానే వ్యవసాయ రంగాన్ని ఉద్ధరిస్తామని టిడిపి కూటమి నాయకులు చెప్పారు. కానీ, ఆ రంగం అభివృద్ధికి అత్యంత కీలకమైన సాగునీటి వనరులకు తగినంతగా నిధులు కేటాయించలేదు. ముఖ్యంగా తోటపల్లి, రామతీర్థసాగర్ పూర్తిచేస్తామని చెప్పారు. కానీ, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రామతీర్థసాగర్‌కు రూ.807.55కోట్లు అవసరం కాగా, రూ.68 కోట్లు, తోటపల్లి రూ.519 కోట్లు అవసరం కాగా రూ.47.81 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇందులో ఆచరణలో ఎంత ఖర్చుస్తారో వేచిచూడాలి. బొబ్బిలి, గజపతినగరం బ్రాంచి కెనాల్ పూర్తిచేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదు.

సహకార రంగంలోవున్న భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని అధికారికంగా మూసేశారు. సంకిలి ఫ్యాక్టరీ కూడా ఇదే దశలో ఉంది. చెరకు రైతుల్ని మోసం చేశారు. కొత్తవలసలో జిందాల్ పరిశ్రమ, గజపతినగరం మండలంలో ఓలం జీడిపిక్కల ఫ్యాక్టరీ మూతపడ్డాయి. ఫలితంగా వందలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయినా ప్రభుత్వంగానీ, జిల్లాకు చెందిన మంత్రిగానీ చలించలేదు. జ్యూట్, ఫెర్రో ఎల్లాస్ పరిశ్రమలు కూడా ఎప్పటికప్పుడు మూతపడుతున్నాయి. మరోవైపు ఎంఎస్ఎంఇ పార్కుల పేరిట జిల్లా వ్యాప్తంగా వందలాది ఎకరాలు సేకరించారు.

రేషనలైజేషన్ పేరిట జిల్లాలో 235 యుపిస్కూల్‌లను మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధ్యాయ పోస్టులను కుదించారు. పాఠశాలలు పున:ప్రారంభం అయినా వీటిలో సదుపాయాలు, సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. వైసిపి హయాంలో స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన టిడిపి నాయకులు నేడు స్మార్టు మీటర్లు పెట్టడంతో విద్యుత్ ఛార్జీలు సామాన్యులకు పెనుభారంగా మారాయి.

మునుపెన్నడూ లేని విధంగా ఉపాధి హామీ అమలులో కూడా జిల్లా వెనుకబడిపోయింది. తగినన్ని పనిదినాలు కల్పించడం లేదు. రూ.వందల కోట్ల బకాయి ఉంది. అంతకు మించి కూలిరేట్లు కూడా గిట్టుబాటు కావడం లేదు. సగటు వేతనం రూ.180 కూడా రావడం లేదు. ఈ విషయంలో మన జిల్లా రాష్ట్రంలోనే వెనుకబడి పోయింది.

టిడిపి - జనసేన కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నప్పటికీ జిల్లాకు ఇచ్చిన హామీల అమలుకు ప్రయత్నించ లేదు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి తగిన సాయం అందించలేదు. ఉన్న కొద్దిపాటి పరిశ్రమలు మూతపడ్డాయి. కొత్త పరిశ్రమలు రాలేదు. సూపర్ -6 పథకాలు కూడా అరకొరగానే అమలు చేశారు. దేశాభివృద్ధికి, మానవ వనరుల వృద్ధికి దోహదపడే గిరిజన విశ్వవిద్యాలయం కన్నా కార్పొరేట్లకు ఉపయోగపడే భోగాపురం ఎయిర్‌పోర్టుకు ప్రాధాన్యతనిచ్చారు.ఇలా చెప్పుకుంటూ పోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, చిన్నచూపు జిల్లాలో కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. కూటమి ఏడాది పాలన ఒక్కసారి పరిశీలిస్తే....

జిల్లాలో జ్వరాలు, సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వీటిపై దృష్టిసారించాల్సిన ప్రభుత్వం యోగాసనాల నేర్పించడం వైద్యారోగ్య బాధ్యతల నుంచి తప్పించుకోవడమే. ఇప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో డోలిమోతలు తప్పడం లేదు. డిఎస్‌సి తప్ప ఇతర ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి ఇస్తామన్న మాట నిలబెట్టుకోలేదు. బిసి రుణాల్లో రాజకీయాల సిఫార్సులకు పెద్దపీట వేశారు. వేపాడ మండలంలోని మారిక కొండను అదానీకి దోచిపెట్టడానికి ప్రభుత్వ పెద్దలు కుట్రచేస్తే జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు నోరు మొదపడం లేదు. భోగాపురం హోటళ్ల నిర్మాణం పేరిట కార్పొరేట్లకు కారు చౌకగా ప్రభుత్వ భూములు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుకి ఇచ్చిన ప్రాధాన్యత గిరిజన యూనివర్శిటీకి ఇవ్వలేదు. ఎనిమిదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ సొంత భవనాలు లేవు. ఇంకా పునాదుల దశలోనే ఉన్నాయి. జిల్లాను చుట్టు ముడుతూ అన్ని వైపులా టోల్‌గేట్లు ఏర్పాటుచేసి, వాహనదారులపై భారాలు మోపారు. అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశా వర్కర్లు వంటి చిరుద్యోగులపై మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రతాపం చూపించారు. రామన్నపేట ఆయా అక్రమ తొలగింపు ఇందుకు ఉదాహరణ. విజన్ -47, 4-పి పేరిట ఆరు నెలలుగా ప్రభుత్వం కాలక్షేపం చేస్తోంది. ప్రజా సమస్యలను, అభివృద్ధి, సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారు.

ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో తగిన పాలన అందించలేకపోతున్నామని సాక్షాత్తు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులే అంగీకరించారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగమౌతున్నాయని, నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంచడం లేదని మూకుమ్మడిగా అంగీకరించారు. కానీ, వీటిని సరిద్దుకునే ప్రయత్నం చేయడం లేదు. ఇప్పటికైనా పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల పంపిణీ, సీజనల్ వ్యాధులు దృష్టి పెట్టాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

30 శాతం దాటని హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి సెలవులు అనంతరం ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలలు గురువారం నుంచి తెరచుకున్నాయి. తొలి రోజు విద్యార్థులంతా ఆనందంగా పాఠశాలకు హాజరయ్యారు. అయితే జిల్లా వ్యాప్తంగా 30 శాతానికి మించి విద్యార్థులు హాజరు కాలేదు. నగరంలో కస్పా హైస్కూల్లో 800కు పైగా విద్యార్థులుంటే వారిలో తొలిరోజు 260 మంది మాత్రమే హాజరయ్యారు.



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

క్లస్టర్ ఖాళీలు చూపించాలని

ఉపాధ్యాయుల ధర్నా

కౌన్సిలింగ్ వాయిదా వేసిన డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్లస్టర్ ఖాళీలు చూపించి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కౌన్సిలింగ్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఉదయం నుంచి నిర్వహించిన కౌన్సిలింగ్‌లో 360 మంది గురువారం పాల్గొన్నారు. ఖాళీలు చూపించకుండా కౌన్సిలింగ్ నిర్వహించడం సరికాదని ఉపాధ్యాయులు అభ్యంతరం తెలిపారు. ఖాళీలు చూపించి కౌన్సిలింగ్ నిర్వహించాలంటూ బహిష్క రించి ధర్నా నిర్వహించారు. దీంతో డిఇఒ మాణిక్యంనాయుడు.. కౌన్సిలింగ్‌ను రేపటికి వాయిదా వేశారు. 500 మందికి జరగాల్సిన కౌన్సిలింగ్ 360 వరకు చేపట్టి, నిలిపివేశారు. ధర్నాలో ఉపాధ్యాయ సంఘాలు ఐక్య వేదిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు

గంజాయి వ్యాపారి ఆస్తులు సీజ్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గంజాయి కేసులో అరెస్టయిన ఒడిశాకు చెందిన పతి ఖిల అలియాస్ గురుకు చెందిన రూ.42.70 లక్షల ఆస్తులను అటాచ్ చేస్తున్నట్లుగా ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా నందపూర్ మండలం బసుపుట్ గ్రామంలో సోబాపుట్ వార్డుకు చెందిన పతి ఖిల అలియాస్ గురు ఆదేశాలతో ఇద్దరు వ్యక్తులు 200 కిలోల గంజాయిని గతేడాది అక్టోబరు 6న తరలిస్తూ శృంగవరపుకోట పట్టణం పందిరప్పన్న జంక్షన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయి అక్రమ రవాణాలో ప్రధాన నిందితుడిగా పతి ఖిలను శృంగవరపుకోట పోలీసులు గుర్తించి, అదే నెల పదో తేదిన అరెస్టుచేశారు. విశాఖలోని సెంట్రల్ జైలుకు రిమాండు నిమిత్తం తరలించారరు. విచారణలో నిందితుడు పతి ఖిల కొన్నేళ్లుగా గంజాయి రవాణా చేస్తూ రూ.42.70 లక్షలు విలువైన స్థిర, చరాస్తులను సంపాదించినట్లుగా గుర్తించారు. ఇటీవల ప్రభుత్వం గంజాయి రవాణాను నియంత్రించడంలో భాగంగా గంజాయి వ్యాపారంతో కూడబెట్టిన అక్రమ ఆస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించి, ఉత్తర్వులు జారీ చేయడంతో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. పతి ఖిల.. సోబాపుట్లో రూ.40 లక్షల విలువైన 10 సెంట్ల స్థలంలో ఇంటిని నిర్మించినట్లుగా గుర్తించారు. రూ.1.50 లక్షల విలువైన ఆటో, రూ.1.20 లక్షల విలువైన బైక్‌ను కొనుగోలు చేసినట్లుగా గుర్తించారు. సునాబెడలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకు ఖాతాకు ఏప్రిల్ 21, 2023న రూ.38,28,816 నగదు జమైనట్లుగా తేల్చారు. ఇవికాకుండా గంజాయి వ్యాపారుల నుండి పతి ఖిల బ్యాంకు ఖాతాకు పలుమార్లు రూ.6.87 లక్షల నగదు జమైనట్లు నిర్ధారించారు. నగదు బదిలీ చేసిన వ్యక్తులు కూడా గంజాయి వ్యాపారాలు సాగిస్తూ, పోలీసులకు పట్టుబడిన వారేనని, వారిపై కూడా రాజస్థాన్, మహారాష్ట్ర, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేసులు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో పతి ఖిల సంపాదించిన అక్రమ ఆస్తుల విలువ రూ.42.70 లక్షలు ఉంటుందని, నిందితుడి అక్రమ ఆస్తులను ఎవరికీ విక్రయించకుండా చట్ట పరిధిలో ఫ్రీజ్ చేసినట్లుగా నోటీసులు కూడా జారీ చేశామని ఎస్పి తెలిపారు. ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పనిచేసిన ఎఎస్పి సౌమ్యలత, ఎస్.కోట సిఐ వి.నారాయణమూర్తి, ఇతర పోలీసు అధికారులను ఎస్పి అభినందించారు.

లక్ష్మింపేట అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - వంగర

మండలం లోని లక్ష్మింపేటలో 2012, జూన్ 12న జరిగిన ఘటనలో ఐదుగురు దళితులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగి 13 ఏళ్ల పూర్తి కావడంతో సంస్మరణ సభా కార్యక్రమాన్ని నిర్వహించి మృతి చెందిన వీరులకు దళిత సంఘాల నాయకులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం అక్కడ నుంచి శ్మశాన వాటిక వద్దకు ర్యాలీగా నినాదాలు చేస్తూ వెళ్లి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా దళిత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకతోటి బాబురావు మాట్లాడుతూ లక్ష్మింపేట ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిందితులకు అనుకూలంగా, దళిత బాధితుల సాక్షులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని అందువల్ల న్యాయమూర్తి (జడ్జి)ని బదిలీ చేసి నిష్పక్షపాతంగా వ్యవహరించిన న్యాయమూర్తిని నియమించాలని కోరారు. దళిత బాధితులు చట్టం ప్రకారం కోరుకున్న న్యాయవాది (పిపి) పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించి విచారణ వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మరి బాబ్జి, దళిత సంఘాల నాయకులు చిన్ని కిరణ్ కుమార్, వసంత రాజేంద్రప్రసాద్, బోను అప్పారావు, యం.గణపతి, డి.రాంబాబు, బి.బుద్ధుడు, జె.నీలయ్య, గంగులు పాల్గొన్నారు.



సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

రామతీర్థంలో భారీ యోగా ప్రదర్శన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి ఆలయ సమీపంలో భారీ యోగా ప్రదర్శన జరిగింది. యోగా విశిష్టతను ప్రజలకు తెలియజెప్పే ఉద్దేశంతో పర్యాటక ప్రదేశాలు, పుణ్య క్షేత్రాలవద్ద మెగా యోగా ప్రదర్శనలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా రామతీర్థంలో గురువారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ వందలాది మంది ఈ యోగా ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు మాట్లాడుతూ, సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతీఒక్కరూ యోగాభ్యాసన చేయాలని కోరారు.

మానసిక, శారీరక ఆరోగ్య సాధనకు యోగా దివ్య ఔషదమని పేర్కొన్నారు. ప్రతీఒక్కరి దైనందిన జీవితంగా యోగా భాగం చేసుకోవాలని సూచించారు. యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్య క్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిపిఒ టి.వెంకటేశ్వ ర్రావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి విటి రామారావు, డిఎస్‌డిఒ వెంకటేశ్వర్రావు, గృహ నిర్మాణ శాఖాధికారి మురళీమోహన్, జిల్లా టూరిజం అధికారి కుమారస్వామి, ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు, ఆలయ ఇఒ వై.శ్రీనివాసరావు, తాహశీల్దార్ సుదర్శనరావు, ఎంపిడిఒ కృష్ణంరాజు, మున్సిపల్ కమిషనర్ తారకనాథ్, పలువురు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ,ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, ఆయుష్ తదితర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న అధికారులు, మహిళలు

విమాన ప్రమాదంపై జెడ్‌పి చైర్మన్ తీవ్ర దిగ్భ్రాంతి

విజయనగరం టౌన్ : గుజరాత్ విమాన ప్రమాదంలో భారీ సంఖ్యలో ప్రయాణికులు మృతి చెందడంపై జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘోర దుర్ఘటన బాధాకరమని పేర్కొన్నారు. విమానం హాస్టల్ భవనంపై కూలడంతో 35 మందికి వైద్య విద్యార్థులు మృతి చెందడం, మరో 16 మంది తీవ్రంగా గాయపడటం హృదయాన్ని కలచివేసిందని పేర్కొన్నారు. ఈ ప్రమాద మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు. విమాన ప్రమాదాలను అరికట్టడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాలలతో పనిచేయించడం నేరం

జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాలలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని, బాల కార్మికవ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత అని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలాజీ మార్కెట్ మర్చంట్స్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరమ్ రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలలను కార్మికులుగా పనిలో చేర్చుకోవద్దని యాజమాన్యాలకు సూచించారు. బాల కార్మికుల నిషేధ చట్టం ప్రకారం బాలలతో పనిచేయిస్తే 6 నెలల జైలు శిక్ష, రూ.25 వేలు అపరాధ రుసుం వేస్తామని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కలిసి పనిచేసి బాల కార్మికుల లేని జిల్లాగా రూపొందించాలని కోరారు. జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరమ్ కన్వీనర్ చిట్టిబాబు మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం సామాజిక బాధ్యత అని అన్నారు, బాలలకు రక్షణ పొందే హక్కు ఉందని, అందులో భాగంగా బాలకార్మిక,వెట్టి కార్మిక స్థితి నుండి రక్షణ కల్పించడం కోసం బాలకార్మిక నిర్మూలన చట్టం తీసుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమం లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ హిమబిందు, జిల్లా బాలల పరిరక్షణాధికారి బి.లక్ష్మి, సహాయ కార్మిక శాఖాధికారి రవికుమార్, డొమెస్టిక్ వర్కర్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ కె వరలక్ష్మి, నేచర్ సంస్థ ప్రతినిధులు, బెజ్జిపురం సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

జిల్లాలో ఎపిఎంఎస్ డైరెక్టర్ పర్యటన

స్టూడెంట్ కిట్లు పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

ప్రజాశక్తి-డెంకాడ, భోగాపురం

ఎపిఎంఎస్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్, ఎస్ఆర్‌కెవిఎం జిల్లా నోడల్ ఆఫీసర్ టెహ్రా సుల్తానా సమగ్ర శిక్ష పిఒ రామారావుతో కలసి గురువారం జిల్లాలో పర్యటించారు. డెంకాడ, భోగాపురం మండలాల్లో పర్యటించి అక్కివరం, భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. అక్కివరం లో సన్నబియ్యంతో విద్యార్థులకు భోజన కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్‌లను అందజేశారు. భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం ఈ నూతన విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలని , సరియైన బోధన ప్రమాణాలను పాటించి రాష్ట్ర విద్యారంగ ప్రమాణాలను పెంచి దేశంలోనే రాష్ట్రాన్ని ఉన్న స్థానంలో నిలపాలని సూచించారు. అనంతరం డిఎస్‌సి పరీక్ష కేంద్రాలైన సీతం అయాన్ డిజిటల్, లెండి ఇంజనీరింగ్ కాలేజీల్లో కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ వి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎపిఎంఎస్ డైరెక్టర్ టెహ్రా సుల్తానా

సంచార పశు ఆరోగ్యసేవ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంచార పశు ఆరోగ్యసేవ వాహనంలో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించడం అన్యాయమని,వెంటనేవారిని విధుల్లోకి తీసుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని, లేదంటి నిరుద్యోగ భృతి అందజేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీల వర్షం కురిపించారని, అధికారంలోకి వచ్చిన తర్వాతఉన్న ఉద్యోగాలను ఊడ పీకుతున్నారని అన్నారు.తాజాగా సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల్లో పనిచేసే ఉద్యోగులను తొలగిస్తున్నారని అన్నారు. గంట్యాడ సంచార పశు ఆరోగ్య సేవ వాహనంలో 2022 నుంచి డ్రైవర్, పైలట్ గా విధులు నిర్వహిస్తున్నారని, వీరిని విధులకు రావద్దని చెప్పడం అన్యాయమని అన్నారు. చిరుద్యోగులను తొలగించడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. తక్షణమే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో నరేష్, దాలమ్మ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో నాణ్యమైన భోజనం అందించాలని

డివిఇఒకు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల లలో నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా అధ్యక్షులు డి.రాము ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ బృందం డివిఇఒకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ప్రారంభించి పది రోజులు గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం మెనూ ఇవ్వలేదన్నారు. పాడైన గుడ్లు రావడం వలన ఉడకబెట్టిన తర్వాత వాసన రావడంతో తినడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గుడ్లు తినని పిల్లలకు ప్రత్యామ్నాయంగా ఎటువంటి కూర అందించడం లేదన్నారు. ఈ సమస్యలపై అధికారులు పర్యవేక్షణ జరిపి ప్రతిరోజు ఉడకపెట్టిన గుడ్డుతో పాటు ఏదో ఒక కూరను పెట్టాలని, రైస్‌ను మార్చాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు నాని, జగదీష్, మురళి, సతీష్ పాల్గొన్నారు.

కాలువలపై అనధికార కట్టడాలు వద్దు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాలువలపై అనధికార కట్టడాలు, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టరాదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా తోటపాలెం మౌర్యా గార్డెన్ వద్ద గుర్తించిన కాలువ ఆక్రమణలను కమిషనర్ ఆదేశాలతో ప్రణాళిక సిబ్బంది తొలగించారు. కాలువపై పలకలను వేసి కాలువ పరిశుభ్రతకు ఆటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో తక్షణం ఆయా పలకలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్


జులై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. ఆమె అధ్యక్షతన సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాజడ్జి మాట్లాడుతూ రాజీ కాదగ్గ అన్ని క్రిమినల్ కేసులను చెక్ బౌన్స్ కేసులను గుర్తించి, స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాటిని జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని సూచించారు. తద్వారా కక్షిదారులకు డబ్బు సమయం వృథా కాదని అన్నారు. పోలీసు అధికారులు వారెంట్ పెండింగ్ ఉన్న కేసులలోనూ గంజాయి, పోక్సో కేసుల్లో ముద్దాయిలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు జిల్లా సూపరిండెంట్ సౌమ్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీనివాస్, మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి, రెండు జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

డ్వామా పీడీకి వ్యకాస నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధి హామీ కార్మికులకు 10 వారాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఉపాది పనులు పాత పద్ధతుల్లోనే చేయించాలని, 200 రోజులు పని రూ.600వేతనం ఇవ్వాలని, మెడికల్ కిట్లు, పనిముట్లు మంచినీరు, మజ్జిగ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డ్వామా కార్యాలయం ఎఒపి.వెంకటమణకు గురువారం వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్ ఆనంద్ పాల్గొన్నారు.



పీడీకి వినతి అందిస్తున్న వ్యకాస, కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి www.prajasakti.com

సిడిపిఒగా లావణ్య

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం ఐసిడిఎస్ సిడిపిఒగా లావణ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎసిడిపిఒకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో సుజాత ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సూపర్‌వైజర్లు శాంతిలత, నాగమణికి బదిలీ అయింది. వీరి స్థానంలో రేఖావాణి, మంగమ్మ, సుభాషిని బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని దేవుదల కెజిబివి పాఠశాలలో గురువారం సర్పంచ్ కుప్పిలి దుర్గమ్మ గవరయ్య, ఎంఇఒ ఎం. వరప్రసాదరావు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఒకటవ తరగతి నుంచి 10 తరగతి వరకు 4,945 మంది విద్యార్థులకు 25,242 పుస్తకాలు వచ్చాయని ఎంఇఒ తెలిపారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి శతశాతం పుస్తకాలు వచ్చినట్టు వెల్లడించారు. ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి, టిడిపి నాయకులు పాలవలస రమణమూర్తి, ఎస్ఎంసి చైర్మన్ పాలవలస కృష్ణ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి - రాజాం

మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ రాజశేఖర్‌ను బుధవారం మండల, మున్సిపాలిటీ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం తరఫున రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా సిఎస్‌డిటి చిరంజీవి ఆధ్వర్యంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ మేరకు లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా బియ్యం పంపిణీ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని తహశీల్దార్ డీలర్లకు సూచించారు. రేషన్ షాపులో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వినియోగదారుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదులూ రాకుండా జాగ్రత్తగా చౌక దుకాణాలను నిర్వహించుకోవాలని సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో వే బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలని, డీలర్లు తహశీల్దార్‌కు విన్నవించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలుప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని శాఖ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. విటి అగ్రహారం సబ్ స్టేషన్ పరిధిలోగల 11కె వి ఉడా ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం ఆర్ అండ్ బి ఏరియా, అలకానంద కాలనీ, కుసుమ గజపతి నగర్, సిటి కాలనీలకు విద్యుత్తు నిలిపివేయబడునని తెలిపారు.

నెల్లిమర్లలో...

నెల్లిమర్ల : నెల్లిమర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని డిఇఇ పి.త్రినాధరావు తెలిపారు. నెల్లిమర్ల సబ్ స్టేషన్ 11కెవినీటి సరఫరా లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం, సాంకేతిక సమస్యలు సరి చేస్తున్న కారణంగా మెయిన్ పంప్ హౌస్, మాస్టర్ పంప్ హౌస్, హౌసింగ్ కాలనీ, నగరపంచాయతీ పంప్ హౌస్, ఎయిర్ బెల్ట్, ఇండస్ టవర్స్, రైల్వే పంప్ హౌస్, కొత్త పేట గ్రామీణ నీటి సరఫరా పథకం, గ్యాస్ గోడౌన్ టౌన్‌పలేపేట, బృందావనం వ్యాలి, కుదిపి, నీలంరాజు పేట, జగ్గరాజు పేట, తారక రామ ప్రాజెక్టు, మిమ్స్, ఎంపిడిఒ కార్యాలయం, ఎంజెపి పాఠశాల, కెజిబివి, ఈపిఎం గోదాం ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

బొబ్బిలి మండలంలో...

బొబ్బిలి : మండలంలోని కలవరాయి, జగన్నాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఇఇ ఆనంద్ అనంతరావు చెప్పారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న విద్యుత్ లైన్ల కింద చెట్టు కొమ్మలు తొలగింపు చేపట్టడంతో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ అంతరాయానికి సహకరించాలని వినియోగదారులను కోరారు.



బాధ్యతలు చేపట్టిన జయశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గురుకుల ప్రిన్సిపల్‌గా జయశ్రీ

ప్రజాశక్తి -వేపాడ

వేపాడ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా టి.జయశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయంపేటలో గురుకులంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, అధ్యాపకులు ఆమెకు స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా పనిచేసిన యు.ఉషారాణి.. విశాఖపట్నం జిల్లా నక్కపల్లి గురుకులానికి బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో సిబ్బంది కుమారి, సుశీల, స్వాతికుమారి, భారతి, పద్మ పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

వేపాడ : వేపాడ, వల్లంపూడి గ్రామ సచివాలయాలను ఇఒపిఆర్‌డి రవికుమార్ గురువారం సందర్శించారు. యోగాంధ్రలో సిటిజన్ రిజిస్ట్రేషన్ వేగంగా పూర్తిచేయాలని చెప్పారు. వల్లంపూడిలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఆధార్ నమోదు పనులు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.


భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి -చీపురుపల్లి

మండలంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తానని తహశీల్దార్ డి.ధర్మరాజు అన్నారు. మండలానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఎటువంటి భూ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. రెవెన్యూపరమైన సమస్యలను కూడా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకోవడానికి పూర్తి సహకారం అందిస్తామని వివరించారు. రెవెన్యూకు సంబంధించిన అన్ని సేవలను ప్రజలకు అందుబాటులో అందిస్తామని ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

లేఅవుట్ల వివరాలు ఇవ్వండి : చైర్మన్

ప్రజాశక్తి-బొబ్బిలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు

మున్సిపాలిటీ పరిధిలో అధికార, అనధికార లేఅవుట్ల వివరాలు అందజేయాలని చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలతో ఆయన సమీక్షించారు. ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు ప్రతిరోజూ వార్డుల్లో పర్యటించి భవన నిర్మాణాలను పరిశీలించాలని సూచించారు. వాటికి నిబంధనల ప్రకారం ప్లాన్ ఉన్నదీ, లేనిదీ గుర్తించి, ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పురపాలక సంఘ ఆస్తులు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బొబ్బిలి- బాడంగి రోడ్డు విస్తరణ చేపట్టిన సమయంలో జిల్లాలో స్వచ్ఛందంగా స్థలాలు ఇచ్చిన వారిలో ఇంకా టిడిఆర్ బాండ్లు రావలసిన వారిని గుర్తించి, వెంటనే వారికి బాండ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ఏడాది పాలన సంబరాలు

వైసిపి హయాంలో అభివృద్ధి, సంక్షేమం గాలికి
కేంద్ర మాజీమంత్రి అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేశారని మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు విమర్శించారు. కూటమి ప్రభుత్వ హయాంలో వీటిని ఒక గాడిలో పెడుతున్నామని తెలిపారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో సంబరాలు జరిగాయి. ముందుగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాజీ అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం లో పాలన కుంటి పడిందని విమర్శించారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఐదేళ్లలో గోడకూడా కట్టలేక పోయారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎన్‌టిఆర్ ఆశయాలకు అనుగుణంగా కార్యకర్తలంతా పని చేయాలన్నారు. కార్యక్రమంలో విజయ నగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వి.పి.రాజు, పార్టీ కార్యాలయ కార్యదర్శి రాజేష్ వర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాదుల కనక మహాలక్ష్మి, విజ్జపు ప్రసాద్, మహిళ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం,రాష్ట్ర నాయకులు కంది మురళి నాయుడు, ఎఎంసి చైర్మన్ కర్రోతు వెంకట నరసింగ రావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారు బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నరసింగ రావు, ప్రధాన కార్యదర్శి గంటా పోలినాయుడు , కనకల మురళీమోహన్ , పిల్లా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భోగాపురం : కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా ఏడాది పాలన సంబరాలు

భోగాపురం : ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా మండలంలోని పోలిపల్లి గ్రామంలో ఘనంగా సంబరాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. నాయకులు దాసరి అప్పలస్వామి, కర్రోతు రాజు, కోరాడ తాతారావు, సూర్యతేజ మాస్టర్, శీరపు శ్రీను, రౌతు రామకృష్ణ, గరికిన చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక టిడిపి కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి స్వీట్ పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గురవాణ నారాయణరావు, సుమల వెంకట మన్మథరావు, పిన్నింటి మోహనరావు, కిమిడి అశోక్, దుప్పలపూడి శ్రీను, దూబ ధర్మారావు, వంగా వెంకటరావు, ముగడ శ్రీను, సమతం శ్రీను, మహేష్, వల్లూరి గణేష్, సురేంద్ర, మరిపి జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి సంబరాలు

గజపతినగరంరూరల్ : గజపతినగరంలోని టిడిపి కార్యాలయంలో గురువారం కూటమి నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, మక్కువ శ్రీధర్,వివి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో రెండు గ్రూపులు
వేర్వేరు చోట్ల ఏడాది పాలన వేడుకలు

డెంకాడ : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు. అయితే మండలంలో టిడిపి రెండు గ్రూపులుగా విడిపోయి వేర్వేరు చోట్ల ఈ వేడుకలను గురువారం నిర్వహించారు. టిడిపిలో ఒక గ్రూపునకు చెందిన మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, విజయనగరం పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పానీరాజ్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. మరో గ్రూపునకు చెందిన పిఎసిఎస్ మాజీ చైర్మన్ ప్రదీప్‌రాజు, టిడిపి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ శివ రామ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో డెంకాడలో భారీ కేకును కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. పార్టీ కార్యక్రమం కాబట్టి పార్టీ కార్యాలయంలో ఈ వేడుకలు నిర్వహించామని ఒక గ్రూపు అంటుండగా, ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించాలని ఉద్దేశంతో గ్రామంలో మహిళల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించామని మరో గ్రూపునకు చెందినవారు తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం కాబట్టి కూటమి నాయకులు ఒకే వేదిక ఏర్పాటు చేసుకుని ప్రజలకు అందిస్తున్న పథకాలు గురించి వివరించాలని ఆదేశాలున్నప్పటికీ మండలంలో ఆ పరిస్థితి కనిపించలేదు. కనీసం జనసేన, బిజెపి నాయకులను కూడా పిలువ కుండా ఎవరికి నచ్చిన విధంగా వారు గ్రూపులుగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం పట్ల సర్వత్రా చర్చ జరుగుతోంది.



సభలో మాట్లాడుతున్న పి.అశోక్‌గజపతిరాజు

ఘనంగా అవనాపు విక్రమ్ జన్మదిన వేడుకలు

తలసేమియా బాధితుల కోసం మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన నాయకులు అవనాపు విక్రమ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. బాలాజీనగరంలోని తన క్యాంపు కార్యాలయంలో పుట్టినరోజు వేడుకల్లో భాగంగా తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని డాక్టర్ అవనాపు భావన ప్రారంభించారు. రక్తదాతలను అభినందించి జ్ఞాపికలను అందించారు. అనంతరం అవనాపు విక్రమ్ తన క్యాంపు కార్యాలయ ఆవరణలో అభిమానులు, కుటుంబ సభ్యులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం తలసేమియా వ్యాధిగ్రస్తుల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. బాధితులకు పౌష్టికాహార కిట్లను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా నిరతి, సామాజిక స్పృ కలిగిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. తలసేమియా బాధితుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మెగా ఫ్యామిలీ సీనియర్ అభిమానులు, కూటమి నాయకులు, వివిధసంస్థల ప్రతినిధులు, నగర ప్రముఖులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు అవనాపు విక్రమ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కుటుంబసభ్యులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న విక్రమ్

ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

దశల వారీగా ప్రభుత్వం హామీలను అమలు చేస్తోందని టిడిపి నాయకులు మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, వివి ప్రదీప్‌కుమార్, గొర్లి బంగారు నాయుడు తెలిపారు. గురువారం గజపతినగరం, పురిటిపెంట పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం అందజేసిన సన్నబియ్యాన్ని అందజేశారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు రేషన్ బియ్యానికి బదులుగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని వారు చెప్పారు. ఎంఇఒ విమలమ్మ మాట్లాడుతూ బియ్యం పక్కదారి పట్టకుండా పక్కా ప్రణాళికతో క్యూఆర్ కోడ్‌ను బియ్యం సంచులపై ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గజపతినగరం : పాఠశాలకు సన్న బియ్యం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రభుత్వ పాఠశాలలో సన్న బియ్యం పంపిణీ

నెల్లిమర్ల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నగర పంచాయతీ ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ మధ్యాహ్నం భోజనం కోసం గురువారం సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం కోసం కూటమి ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు, కౌన్సిలర్ మజ్జి అన్నపూర్ణ, కమిషనర్ ఎ. తారక్ నాథ్, ఎంఇఒ వి.జ్ఞాన శంకర్, హెచ్ఎం ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నేడు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత గురువారం స్థానిక సబ్‌జైలును తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ ఏమైనా కేసుల సమస్యలు ఉంటే జైలు సూపరింటెండెంట్ ద్వారా మండల న్యాయ సేవా కమిటీకి దరఖాస్తు చేయాలని తెలిపారు. ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ను తనిఖీ చేసి సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఖైదీలకు కల్పిస్తున్న వసతులతోపాటు ప్రాంగణ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఖైదీల కే కాకుండా బయట వారికి కూడా ఉచిత న్యాయ సహాయం అందించడానికి ప్రతి కోర్టు ప్రాంగణంలో ఒక న్యాయ సేవా సంస్థను ఏర్పాటు చేశామని, వాటి ద్వారా ఎటువంటి రుసుము చెల్లించకుండా తగు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని తెలిపారు. జులై5న జరిగే లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ , జైలు సూపరింటిండెంట్, న్యాయవాది టివి రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌జైలు పరిసరాలను పరిశీలిస్తున్నజిల్లా జడ్జి బబిత

భవన నిర్మాణాలన్నీ పన్ను పరిధిలోకి రావాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఇప్పటికే పూర్తయిన భవన నిర్మాణాలన్నింటినీ ఆస్తిపన్ను విధింపు పరిధిలోకి తీసుకు రావాల్సి ఉందని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు పేర్కొన్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు గురువారం పన్ను పరిధిలోకి రాని భవనాల వద్దకు వెళ్లి ప్రణాళిక సిబ్బందితో అవసరమైన కొలతలను తీయించి పన్ను పరిధిలోకి వచ్చే విధంగా నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదివరకు పన్ను పరిధిలో ఉన్న భవనాలకు మార్పులు, చేర్పులు జరిపితే అట్టి భవన నిర్మాణాలు కూడా పన్ను పరిధిలోకి రావాలన్నారు. ఇందుకోసం నగరంలోని 60 సచివాలయాల పరిధిలోని పరిపాలన కార్యదరుశులకు ఈ విషయమై సర్వే జరిపి నివేదికలు సమర్పించాలని ఆదేశించామన్నారు. పైన తెలిపిన భవనాలను గుర్తించి వాటికి పన్ను విధింపు చేసి తద్వారా నగరపాలకులకు సంస్థ ఆదాయాన్ని మెరుగుపరుచుకోవాల్సిన ఉందని తెలిపారు.

సహాయ కమిషనర్ వార్డు సందర్శన

నగరంలోని 38వ డివిజన్ 46 వ నెంబర్ సచివాలయ పరిధిలో నిర్వహించిన వార్డు సందర్శన కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు పాల్గొన్నారు. బొబ్బాదిపేట మదర్ తెరిసా విగ్రహం నుండి ప్రారంభమైన వార్డు సందర్శన కార్యక్రమంలో పలు అంశాలను గుర్తించారు. కాలువలు, రహదారులు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాల పై ప్రజాభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అత్యాచార కేసులో నిందితుడికి 12ఏళ్ల జైలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆంధ్ర పోలీసు స్టేషనులో 2023లో నమోదైన అత్యాచారం కేసుకుసంబంధించి నిందితుడు మాదిరెడ్డి అప్పారావుకు 12ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ మహిళా కోర్టు, 5వ ఎడిజె కోర్టు జడ్జి ఎన్.పద్మావతి తీర్పు చెప్పారు. మెంటాడ మండలం కుంటినవలస గ్రామానికి చెందిన మాదిరెడ్డి అప్పారావు అదే గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుమేరకు అప్పటి ఎస్ఐ పి.సిద్ధార్థ కేసు నమోదు చేశారు. అప్పటి గజపతినగరం సిఐ ఎల్.అప్పల నాయుడు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకుతరలించగా, తరువాత దర్యాప్తు చేపట్టిన ఇన్స్పెక్టరు ఎన్.వి.ప్రభాకర్ నిందితుడిపై న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు.న్యాయస్థానంలో నిందితుడు మాదిరెడ్డి అప్పారావు నేరానికి పాల్పడినట్లు రుజువు కావడంతో నిందితుడికి 12ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా ఆధారాలు సేకరణలో కృషి చేసిన అధికారులను ఎస్‌పి అభినందించారు.

పాఠశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలం లోని తమ్మిరాయుడుపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గురువారం సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో యువత ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఎస్ఐ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, కనకల చంద్రరావు, సచివాలయ ఉద్యోగి నగేష్ పాల్గొన్నారు.

లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సల పట్ల అవగాహన ఉండాలి

డాక్టర్ శ్రీరామమూర్తి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎముకుల వైద్య నిపుణులు డాక్టర్ ఎ.శ్రీరామమూర్తి అన్నారు. గురువారం స్థానిక సాయి ఆసుపత్రిలో జిల్లా ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ గైనకాలజిస్ట్ కట్టమూరి సింధూరిని సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శ్రీరామమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు గర్భసంచికి సంబంధించి ఏర్పడే సమస్యలకు లాప్రోస్కోపిక్ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. వారు మందులు కొనుగోలు చేసుకుంటే సరిపోతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ సింధూరి మాట్లాడుతూ మహిళలకు కడుపులో ఏర్పడే వివిధ రకాల కాయలు, గాల్బేడర్ తదితర చికిత్సల కోసం కుట్టు, కోత లేకుండా లాప్రోస్కోపీ విధానం ఎంతో శ్రేయోధాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సిహెచ్ నాగరాజు, ప్రతినిధులు పి.ఈశ్వరరావు, ఎ.సందీప్, జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు మండవల్లి వెంకటరాజు, కార్యదర్శి ఏడుకొండలు, వెత్సా సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని తీర ప్రాంతమైన ముక్కాం గ్రామంలో సురపతి దానయ్య (45) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం ఉదయం జరిగింది. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం. ముక్కాం గ్రామానికి చెందిన సురపతి దానయ్య విశాఖపట్నంలో ఉంటూ చేపల వేటకు వెళుతుంటాడు. ఇటీవల నాలుగు రోజుల కిందట భార్యతో గొడవపడడంతో విశాఖ పోలీస్ స్టేషన్‌లో భర్త పై ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో అవమానంగా భావించిన దానయ్య ముక్కాం గ్రామం వచ్చి తన ఇంటి పక్కనే ఉన్న అమ్మవారి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఈ నెల 13న వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు జన్మదినం పురస్కరించుకొని ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వలిరెడ్డి యువసేన తెలిపింది. శుక్రవారం ఉదయం 10గంటలకు చీపురుపల్లి పంచాయతీ, పి.కె.పాలవలస గ్రామంలో శ్రీకాకుళం జిల్లా, రాగోలు జెమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసు కోవాల్సిందిగా వైసిపి నాయకులు కోరారు. అదే ప్రాంతంలో కేక్ కటింగ్ చేసిన అనంతరం, బాపూజీ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు రొట్టెలు, చీపురుపల్లి ప్రభుత్వహాస్పిటల్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ నిర్వహిస్తామన్నారు.